## ఉపోద్ఘాతము:

"భాష్యే ద్వే శ్రీ మహత్ శబ్ద భూషితే శేషభాషితే" అని ఆ అనంతుడే పతంజలి రూపమున నవతరించి వ్యాకరణ

మహాభాష్యమును, భగవద్రామానుజులుగా ననుగ్రహించి బ్రహ్మ సూత్ర భాష్యమైన శ్రీభాష్యమును రచించెనని ఆర్యోక్తి.

తర్క, మీమాంసాది శాస్త్రములను అన్నిటిని సమగ్రముగా నధ్యయనము చేసిన వారు మాత్రమే ఈ భగవద్రామానుజులు

అందిచ్చిన శ్రీభాష్య గ్రంధాధ్యయనాధికారము పొందగలరు. అట్టి శ్రీభాష్యమును పూర్తిగా అర్థము చేసికొనుట చాల కష్టము. శ్రీభాష్య వ్యాఖ్యానములలో శ్రీమాన్ సుదర్శన సూరి ప్రసాదించిన "శ్రుత ప్రకాశికా వ్యాఖ్యానము" ఉత్తమోత్తమమైనదని పెద్దలు చెప్పుదురు.

మొదటి నాల్గు బ్రహ్మ సూత్రములకు భగవద్రామానుజులు ప్రసాదించిన భాష్యమును "చతుస్సూత్రి" అని అంటారు. అందులో మొదటిదయిన "జిజ్ఞాసాధికరణము" నకు శ్రీమాన్ న.చ. రఘునాథాచార్య స్వామి వారు చాలా విపులమైన వ్యాఖ్యను శ్రుత ప్రకాశికా వ్యాఖ్యానము" ననుసరించి తెలుగులో ప్రచురించి యున్నారు. శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీరంగరామానుజ జీయర్ స్వామి వారు సరళమైన తెలుగు భాషలో చతుస్సూత్రి విషయములను సంభాషణా రూపముగా "ఆయనెవరు నేనెవరు అదేమిటి" అను చక్కని గ్రంథరూపమున అందించి యున్నారు.

ఆ పుస్తకములలో నాకు అర్థమయినట్లున్న కొన్ని విషయాలను ఈ చిన్ని ఈ-పొత్తములో పొందుపరచడం జరుగుతోంది.

ఇది చాలా దుస్సాహసమైన ప్రయత్నమైనా, ఎల్ కే జీ పుస్తకము వలె శ్రీభాష్యము అంటే కొంచెం అవగాహన

కలగడానికి ఉపయోగపడవచ్చుననే ఉద్దేశ్యముతో కొందరు పెద్దలు, శ్రేయోభిలాషులు ఆమోదమును తెలిపి

ప్రోత్సహించేరు. వారందరికీ కృతజ్ఞతలు.

ఈ పుస్తకములో కూడా సంభాషణా రూపముగా కల్పించబడినది. ఇందులో పాత్రలు కేవల కల్పితాలు. అన్యథా భావించ వలదని మనవి.

ఇందులో చతుస్సూత్రి భాగములో పూర్వ పక్షమును "నేను" అనే పాత్ర, సిద్ధాంత భాగాన్ని "అమ్మ" అనే పాత్ర నిర్వహించినట్లుంటుంది. ఈ చతుస్సూత్రి తరువాత భాగములో "సిద్ధాంత భాగము" "మామయ్య" అను పాత్ర చేత నిర్వహించబడినట్లుంటుంది.

శ్రీభాష్యము మొదటి అధ్యాయపు విషయాలు క్లుప్తంగా ఇందులో పొందుపరచబడినాయి.

చదువరుల సౌలభ్యము కొఱకు "చతుస్సూత్రి" లో విషయాలు సంగ్రహముగా ఈ క్రింద ఉట్టంకించడం జరిగింది.

"చతుస్సూత్రి" అంటే "నాలుగు సూత్రములు కలది" అని అర్థము. శ్రీభాష్యములో మొదటి నాలుగు సూత్రములను కలిపి "చతుస్సూత్రి" అని అంటారు కదా.

ఇందులో మొదటి సూత్రమైన "అథాతో బ్రహ్మ జిజ్ఞాసా" అను సూత్రములో "ఇంక ఇందువలన బ్రహ్మను తెలుసు కొనదము" అంటే "ఎప్పుడు ఎందువలన బ్రహ్మను తెలుసుకొనదము" అన్న వివరాలు చెబుతారు.

భగవద్రామానుజులకు ముందు "అద్వైత సిద్ధాంతము" ప్రచారములో ఉండేది. ఈ సిద్ధాంతము ప్రకారము క్లుప్తంగా

1. బ్రహ్మ ఒక్కటే ఉన్నది. అదే సత్యమైనది. దీనికే జ్ఞానము, చిత్, అనుభూతి, ఆత్మ మొదలైన పేర్లు ఉన్నాయి.

2. బ్రహ్మ విచారము మీద ఆసక్తి కలిగిన తరువాత కర్మలతో పనిలేదు.

3. అందువలన వేదములలో కర్మ కాండ చెప్పే శ్రుతులతో బ్రహ్మను తెలుసుకునే వారికి పనిలేదు.

4. బ్రహ్మ నిర్విశేష చిన్మాత్రము. అనగా ఏ విశేషములు, గుణములు, ధర్మములు లేని చైతన్యము. శ్రుతులు కూడా చివరకు అలాగే చెప్పేయి. అందువలన తరువాత బ్రహ్మను నిర్విశేషముగ చెప్పే శ్రుతులను మాత్రమే పరిగణన లోనికి తీసుకోవాలి తప్ప అంతకు ముందు బ్రహ్మను సగుణముగా చెప్పే శ్రుతులను పరిగణనలోనికి తీసుకొననక్కరలేదు.

5. ఆ బ్రహ్మ తప్ప ఈ కనబడుతున్న చేతనా చేతనమైన జగత్తు మిథ్యయే.

6.కాని ఇవన్నీ ఇలా కనబడడానికి కారణము అవిద్య.

7. ఈ అవిద్య "తత్త్వమసి", "ప్రజ్ఞానమ్ బ్రహ్మ" మొదలైన శ్రుతి వాక్యముల వలన పోయి, ఈ కనబడేదంతా బ్రహ్మ యేనని కేవలము జ్ఞానము తప్ప జ్ఞాత, జ్ఞేయము అంటే తెలుసుకొనేది, తెలుసుకొనబడేది అంటూ ఇలా భేదాలు ఉండవనీ అన్న విషయము అనుభవము లోనికి వస్తుంది.

8.అలా తాను వేఱుగా లేనని, ఉన్నది బ్రహ్మయే నను అనుభవస్థితి యే మోక్షము.

9. ఇలా బ్రహ్మ విచారము చేయడానికి సాధనా చతుష్టయము అని నాలుగు విషయాలు అనవసరమనీ చెబుతుంది ఈ సిద్ధాంతము.

ఈ సిద్ధాంతాన్ని అనుసరించే వారు బ్రహ్మ గురించి తెలుసుకోవడం ప్రారంభించిన తరువాత కర్మ విచారము అక్కరలేదనీ, బ్రహ్మ విచారము చేయడం వలన బ్రహ్మ అయిపోతామనీ అనుకునే వారట.

భగవద్రామానుజులు అద్వైతములో చెప్పబడిన పై అంశాలను సంస్కరిస్తూ బ్రహ్మ సూత్ర భాష్యాన్ని అందించేరు.

దీనిలో అంతకు ముందు చెప్పబడిన అద్వైత పరమైన అంశాలను పూర్వ పక్షమని అంటారు. వాటిని సవరిస్తూ వివరించిన భగవద్రామానుజుల ప్రతిపాదనను సిద్ధాంతము అని అంటారు.

మొదటి సూత్రములో భగవద్రామానుజులు విహిత కర్మలు అవసరమేనని, అయితే కామ్య కర్మలేవైనా అల్పమైన, అస్థిర మైన ఫలాలను ఈయడం వలన అనంతమైన శాశ్వతానందాన్ని పొందడానికి బ్రహ్మ విచారము అవసరమనీ, అందుకు సాధనా సప్తకము అని ఏడు విషయాలు అవసరమనీ భగవద్రామానుజులు ప్రతిపాదిస్తారు. వారి సిద్ధాంతములో ముఖ్యాంశాలు

1. ఈ కనబడేదంతా సత్యమే, అసత్యము లేదా మిథ్య కాదు. అంటే ఈ కనబడే అచైతన్యమైన జగత్తూ (అచిత్), సుర, నర, తిర్యక్, స్థావరములనబడు జీవుళ్ళూ(చిత్), బ్రహ్మ –ఈ మూడూ కూడా సత్యమైన తత్త్వములే.

2. జీవుళ్ళు బ్రహ్మను ఆ బ్రహ్మ అనుగ్రహము వలన పొందడము వలన శాశ్వతానందాన్ని పొందగలరు. దీనినే మోక్షము అని అంటారు. అలా పొందడానికి శ్రుతులలో చెప్పబడినట్లు ఉపాసన అవసరము. వాక్యార్థ జ్ఞానము వలన మోక్షము లభించదు.

3. సృష్టిలో భేదమున్నది.

4. శ్రుతులన్నీ ప్రమాణాలే. బ్రహ్మకు నిర్గుణత్వాన్ని మాత్రము చెప్పేశ్రుతులు మాత్రము ప్రమాణము అని అనుకొనరాదు. అయితే వాటిని సమంగా అంటే చైతన్యమున్న జీవుళ్ళకూ, అచైతన్యమైన జగత్తునకూ బ్రహ్మ అంతర్యామిగా ఉండి అంటే బ్రహ్మ వాటిని విశిష్టముగా కలిగి ఉండడం వలన బ్రహ్మకు వాటితో శరీరి, శరీర సంబంధమున్నదనీ, అందువలన బ్రహ్మ లేని పదార్థము లేదనీ అర్థము చేసుకోవాలి.

5. భేద జ్ఞానానికి కారణము అవిద్య అనడం సరి కాదు. అసలు అట్టి అవిద్య ఉండడానికి అవకాశము లేదు. జీవుళ్ళ అజ్ఞానము బ్రహ్మ అనుగ్రహము వలన తొలగుతుంది.

ఈ విషయాలను మొదటి సూత్రములో భగవద్రామానుజులు ప్రతిపాదిస్తారు. దీనినే "సిద్ధాంతము" అని అంటారు.

ఈ విధముగా శంకర భగవత్పాదుల ముందు నున్న వేద బాహ్యములై పరమాత్మయే లేదను బౌద్ధాది నాస్తిక మతములచేత ప్రభావితులైన ప్రజలను వేదముల ప్రక్కకు దారి మళ్ళించి, శంకర భగవత్పాదులు పరమాత్మ యొక్క అస్థిత్వాన్ని ప్రతి పాదించిన తరువాత, భగవద్రామానుజులు వారు ప్రారంభించిన పనిని సంస్కరించి సుసంపన్నము చేసేరని కొంతమంది పెద్దలు చెబుతారు.

కేవలము శాంకరాద్వైతమే కాక ఆరోజులలో నున్న ఉపాధి వలన కలుగు తాత్కాలిక భేదమను భాస్కరుల, పరిణామము వలన  కలుగు తాత్కాలిక భేదమను యాదవ ప్రకాశుల భేదాభేద వాదములు కూడా ఈ సందర్భములో భగవద్రామానుజుల చేత ప్రస్తావించబడి, సంస్కరించ బడినాయి.

ఈ భాష్యములో భగవద్రామానుజులు తాము పరిగణనలోనికి తీసికొన్న ప్రత్యక్ష, అనుమాన, శబ్ద ప్రమాణాల ద్వారా తన ప్రతిపాదనలను ఈ వాదాలలో స్థాపిస్తారు. శ్రుతి, స్మృతి, పురాణ వాక్య ప్రమాణాలతో మాత్రమే కాకుండా, తార్కికంగా కూడా నిర్ద్వంద్వంగా, నిరవద్యంగా తన సిద్ధాంతాలను నిరూపిస్తారు భగవద్రామానుజులు.

" బ్రహ్మను తెలుసుకోవడం వలన ప్రయోజనమేమి" యను మీమాంసకులకు సమాధానముగా బ్రహ్మను పొందే విధానము, తత్ఫలమైన మోక్షము గురించి తెలుసు కోవడం జరుగుతుంది కనుక ఆ బ్రహ్మను గురించి తెలుసు కోవడం అవసరమే అన్న విషయాన్ని నిర్ధారిస్తారు భగవద్రామానుజులు ఈ సూత్ర భాష్యములో.

ఇంక రెండవ సూత్రములో బ్రహ్మ అంటే జగత్తుయొక్క "సృష్టి, స్థితి, లయాదులు" నిర్వహించువాడు అన్న విషయాన్ని నిర్వచిస్తారు భగవద్రామానుజులు.

" ఏ కార్యానికైనా కారణము ఉంటుంది కనుక, ఈ జగత్తు అనే కార్యానికి బ్రహ్మ అనే కారణము ఉండాలని మనకు అనుమాన ప్రమాణము, తర్కము వలన తెలియడం వలన, బ్రహ్మను తెలుసుకుందికి మఱి శ్రుతుల అవసరము ఏమున్నది" అన్న మీమాంసకుల ప్రశ్నకు, కేవల అనుమాన ప్రమాణము వలన, ఈ పనులన్నీ ఒక్క బ్రహ్మ వలననే జరుగుతాయా, ఆయన వివరాలేమిటి అన్న విషయాలేమీ అనుమానము వలన తెలియవు కనుక ఆ వైశద్యమునకై శ్రుతుల వలన బ్రహ్మ తెలియబడునన్న విషయము మూడవ సూత్రము.

నాల్గవ సూత్రములో వాదము క్రొత్త రకంగా ఉంటుంది.

బ్రహ్మను తెలుసుకొనడం గురించి విధి, నిషేధాలు లేకుండా ఉంటే ప్రయోజనము ఉండదు అనే మీమాంసకుల వాదాన్ని "ప్రపంచము ప్రాతి భాసికము, సాధన వలన దానిని లేనట్లు గుర్తించి అంటే నిష్ప్రపంచీకరణము చేసికొని

మోక్షము సాధించాలనే "భర్తృ ప్రపంచ వాదము" చేత సమాధానము చెప్పించి, దానికి "బ్రహ్మ సత్యము" అని "ధ్యానము" చేయుట వలన మోక్షము కలుగునను "మండన మిశ్రుల వాదము చేత ఉత్తరమునిప్పించి, దానికి వాక్యార్థ జ్ఞానము వలన మోక్షము కలుగునను శాంకరాద్వైతుల చేత సమాధానము చెప్పించి, ఇలా పలు వాదముల పిదప భగవద్రామానుజులు తన సిద్ధాంతమును "శ్రుతులన్నీ" సమన్వయము చేసికొని తెలుసుకొనుటకు బ్రహ్మయే ప్రయోజనమన్న విషయము వివరిస్తారు.

ఈ విధంగా ఈ నాలుగు సూత్రములలో, భగవద్రామానుజులు తన సూత్ర భాష్యములో, బ్రహ్మ ను ఎప్పుడు, ఎందులకు తెలుసుకోవడం ప్రారంభించాలి, బ్రహ్మ అంటే ఏమిటి, దానిని ఎలా తెలుసుకోవాలి, తెలుసుకొని ఏమి చేయాలి, దాని ప్రయోజనము ఏమిటి అన్న విషయాలు వివరించేరన్నమాట.

**పై విషయాలను క్లుప్తంగా సంభాషణా రూపములో పొందుపరచడం జరిగింది. ఈ చిన్ని ప్రయత్నములో దొరలిన దోషములను విజ్ఞులు మన్నించి ఆశీర్వదించమని విన్నపము.**

# విషయసూచిక

ముందుమాట 1

దర్శనములు– మతములు. 2

బ్రహ్మ విచారము అవసరమే 9

కర్మలు కూడా అవసరము. 10

నిత్యము– ప్రవాహతో నిత్యము. 11

అవిద్య. 11

సగుణ నిర్గుణ శ్రుతులు. 12

కర్మ కాండ జ్ఞాన కాండ. 12

సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ 13

తత్త్వమసి. 14

నివర్తక అనుపపత్తి(క్లుప్తంగా). 17

శరీరాత్మ భావము. 18

భాస్కర, యాదవ ప్రకాశక వాదాలు 20

అభేద శ్రుతులు, స్మృతి వాక్యాలు. 22

మాయ, మిథ్య, అవిద్య. 23

సాధనా చతుష్టయము. 24

సాధనా సప్తకము. 24

ఆశ్రయ అనుపపత్తి(క్లుప్తంగా). 25

| | |
|---|---|
| నిర్విశేష చిన్మాత్రము సాధ్యం కాదు. | 27 |
| జ్ఞానము లక్షణాలు. | 29 |
| ధర్మ జ్ఞానము, ధర్మ భూత జ్ఞానము | 31 |
| జ్ఞానము ఆత్మ కాదు. | 34 |
| ఆత్మ యే కర్త, జ్ఞానము కాదు. | 34 |
| జ్ఞాన ప్రసారము. | 35 |
| కలలు సత్యం, నిద్రలో ఆత్మ ఉంటుంది | **39** |
| అహంకారము అంటే? | 40 |
| జ్ఞానాలన్నీ యదార్థాలే. | 41 |
| అన్ని శ్రుతులూ ప్రమాణాలే. | 42 |
| స్ఫోట వాదము. | 45 |
| అనృతేనహి ప్రత్యూఢాః అర్థము. | 47 |
| ఆశ్రయ అనుపపత్తి. | 48 |
| తిరోధానుపపత్తి. | 49 |
| స్వరూపానుపపత్తి. | 51 |
| అనిర్వచనీయానుపపత్తి. | 54 |
| ప్రమాణానుపపత్తి. | 55 |
| నివర్తకానుపపత్తి. | 69 |
| నివృత్త్యనుపపత్తి. | 71 |

అపచ్ఛేద న్యాయం 73

బ్రహ్మ గుణాలు నిరుపాధికాలు. 74

బ్రహ్మ గుణాలు అనుభవ సాధ్యాలే. 79

శాస్త్ర ప్రమాణము. 80

స్మృతి పురాణ ఘట్టము. 81

మొదటి సూత్రార్థము. 119

జన్మాద్యధికరణము. 120

శాస్త్రయోనిత్వాధికరణము. 130

సమన్వయాధికరణము. 143

నాలుగు సూత్రాల అర్థము. 172

## (సమన్వయాధికరణములో పాత్రల చేత నిర్వహింపబడిన వాదములు దిగువ నీయబడినవి).

---

**నేను:** ప్రాభాకరుల పూర్వ మీమాంస

**భర్తృహరి:** నిష్ప్రపంచీకరణ నియోగ వాదము

**(మండన) మిశ్ర:** ధ్యాన నియోగ వాదము

**శంకర రావు:** అద్వైతము(శంకర భగవత్పాదులది)

**యదు భాస్కర్:** భేదాభేద వాదము( యాదవ ప్రకాశ, భాస్కరాచార్యుల వారిది)

**అమ్మ:** రామానుజ సిద్ధాంతము